సాక్షి సంగారెడ్డి

గురువారం । 13 । మార్చి । 2025



ఆరోగ్య కుసుమ

ఆరోగ్య ప్రదాయిని కుసుమ నూనె వినియోగం ఇటీవల ఎక్కువైంది.


వివరాలు 8లో ▸



సామాన్యులకు బిగ్ రిలీఫ్

నిత్యం ఆకాశాన్నంటే కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో సామాన్యులు ఊరట చెందుతున్నారు.

వివరాలు 9లో ▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురువారం సా. 6.31 గం.	శుక్రవారం ఉ. 5.03 గం.

న్యూస్‌రీల్

వివాదాస్పద భూమిని పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గుంజోటి గ్రామంలో వివాదాస్పదంగా మారిన ప్రభుత్వ భూములను బుధవారం ట్రైనీ కలెక్టర్ మనోజ్, జహీరాబాద్ ఆర్‌డీవో రాంరెడ్డి పరిశీలించారు. 112 సర్వే నంబర్‌లో సుమారు 59 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమిలో గ్రామానికి చెందిన కొందరు గతంలో పట్టాలు పొందారు. ఐతే పట్టాలు లేకున్నా తాతల నుంచి వచ్చిన భూమని సాగు చేసుకుంటున్నామని కొందరు, ప్రభుత్వం తమకు భూమి ఇచ్చిందని ఇది తమకే చెందుతుందని మరికొందరు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు వివాదస్పదంగా మారిన భూములను బుధవారం ట్రైనీ కలెక్టర్ మనోజ్, జహీరాబాద్ ఆర్‌డీవో రాంరెడ్డి పరిశీలించి వివరాలను అక్కడి రైతులనుంచి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ భూపాల్ తదితరులు ఉన్నారు.

వీఆర్‌ఏల ముందస్తు అరెస్టు



అరెస్టు అయిన వీఆర్‌ఏలు

నారాయణఖేడ్: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శాసనసభను ముట్టడించేందుకు వీఆర్‌ఏలు యత్నిస్తున్నారనే సమాచారంతో బుధవారం ఉదయం నారాయణఖేడ్‌లో పోలీసులు ముందస్తుగా పలువురు వీఆర్‌ఏలను అరెస్టు చేశారు. వీఆర్‌ఏల సంఘం నాయకులు శంకర్, యాదయ్య, అల్లంరాజు, తుకారం, చోటుమియాలను అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ... తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, అరెస్టులతో తమ ఉద్యమాలను ఆపలేరన్నారు.

పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు



మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన పోలీసులు

జహీరాబాద్ టౌన్: పెండింగ్ బిల్లుల కోసం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లను బుధవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మాజీ సర్పంచ్‌లతో కలసి వెళ్తున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ కూడా జహీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అప్పులు చేసి గ్రామాల అభివృద్ధి చేశామని, బకాయి బిల్లులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఈ పరీక్షలలో భాగంగా బుధవారం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థులకు బోటనీ, ఎంపీసీ విద్యార్థులకు మ్యాథ్స్–2, సీఈసీ విద్యార్థులకు సివిక్స్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు 16,727మంది విద్యార్థులకు గానూ 16,375 మంది విద్యార్థులు హాజరు కాగా 352మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విభాగంలో 15,188మందికి గానూ 14,925మంది విద్యార్థులు హాజరు కాగా 263మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,539 మంది విద్యార్థులకు 1,450మంది హాజరు కాగా 89మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

విగ్రహాలకు ముసుగు తొలగింపు



ముసుగు తొలగించిన విగ్రహం

సాక్షి ఎఫెక్ట్

సంగారెడ్డి క్రైమ్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పట్టణంలో 'విగ్రహాలకు ధరించిన ముసుగు తొలగించరా'అంటూ ఈనెల 11న ప్రచురితమైన 'సాక్షి'కథ నానికి స్పందించిన పట్టణ మున్సిపల్ అధికారులు స్పందించారు. విగ్రహాలకు వేసిన ముసుగును బుధవారం తొలగించారు.

అధికార్‌ల దందా..!

- సొంత వాహనాలను వాడుకుని...
- అద్దె కార్ల పేరుతో నెలనెలా సుమారు రూ.7.80 లక్షలు డ్రా
- విద్యుత్‌శాఖలో ఏళ్లుగా కొనసాగుతున్న దందా..

విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కార్యాలయం అధికారులు తమ బినామీ పేర్లతో ఉన్న సొంత కార్లను వాడుకుంటూ...కాంట్రాక్టర్ల పేరుతో ప్రతినెలా సుమారు రూ.7.80 లక్షలు బిల్లులు డ్రా చేస్తున్నారు. ఇలా ఏడాదిలో సుమారు రూ.93 లక్షలకు పైగా చెల్లిస్తున్న బిల్లుల్లో పెద్ద మొత్తంలో అవకతవకలు జరుగుతున్నాయి.

– సాక్షిప్రతినిధి, సంగారెడ్డి:



విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కార్యాలయం ఆవరణలోని పార్కింగ్ ప్లేసులో ఉన్న వాహనాలు

రూ.లక్షల్లో వేతనాలు... పెద్దమొత్తంలో అలవెన్సులు ఏ ప్రభుత్వ శాఖలలో లేనంత స్థాయిలో రూ.లక్షల్లో వేతనాలు.. ప్రతినెలా పెద్ద మొత్తంలో అలవెన్సులు.. పైగా కొందరు అధికారులకు ప్రతి పనిలోనూ పర్సెంటేజీలు..ఇవేవీ చాలవన్నట్లు విద్యుత్‌శాఖలో కొందరు అధికారులు అద్దె కార్ల దందాను కూడా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తమ సొంత వాహనాల్లో నామమాత్ర దూరం తిరిగి.. ప్రతినెలా సంస్థ నుంచి బిల్లులు దండుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బినామీ కాంట్రాక్టర్ల పేర్లతో రికార్డులు సృష్టించి అందినకాడికి దండుకుంటున్నారు. ఇలా అద్దె కార్ల పేరుతో ప్రతినెలా సుమారు రూ.7.80 లక్షలకు పైగా బిల్లులు డ్రా చేస్తున్నట్లు అంచనా. అంటే ఏడాదికి సుమారు రూ.93 లక్షలకు మించి చెల్లిస్తున్న అద్దె బిల్లులలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి.

ఏడీఈ.. ఆ పైస్థాయి అధికారులకు వాహనం

విద్యుత్ శాఖలో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఏడీఈ ఆపై స్థాయి అధికారులు వాహన సదుపాయం కల్పిస్తోంది. అలాగే అకౌంట్స్, సివిల్, ఎంఆర్‌టీ, కన్‌స్ట్రక్షన్ తదితర విభాగాల్లోని అధికారులకు కూడా ఈ వాహన సదుపాయం ఉంటుంది. ఇలా ఈ విద్యుత్‌శాఖలో జిల్లాలో సుమారు 20 మంది అధికారులకు వాహన సదుపాయం ఉంది. ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే వెంటనే వాటిని సరిచేసేందుకు..మీటర్ రీడింగ్ చెక్‌చేసేందుకు..క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించేందుకు ఈ అధికారులు ఈ వాహనాలను వినియోగించాలి. ఇందుకోసం అద్దె కార్లను తీసుకుంటున్నట్లు రికార్డుల్లో చూపుతున్నారు.

రీడింగ్ చెక్ చేసేదెవరు..?

ఈ అద్దె కార్లు కార్లు రోజుకు ఎన్ని కిలోమీటర్లు తిరుగుతోంది.. ఎక్కడెక్కడికి తిరిగింది.. వంటి రికార్డులను నిర్వహించాలి. వాటిని పై స్థాయి అధికారులు తనిఖీలు చేయాలి. కానీ చాలా మంది అధికారులు బినామీ కాంట్రాక్టర్ల పేరుతో సొంత వాహనాల్లో తిరిగే వారు కావడంతో ప్రతినెలా గుట్టు చప్పుడు కాకుండా ఈ అద్దె కార్ల బిల్లులు డ్రా చేయడం గుట్టుగా సాగిపోతోంది. సాధారణ కార్లు, ట్రాలీలతో కూడిన వాహనాలను అద్దె తీసుకోవడం ద్వారా అధికారుల కార్ల దందాకు చెక్‌పడటమే కాకుండా కొంతలో కొంతైనా విద్యుత్ పంపిణీ సంస్థకు కూడా ఆర్థికంగా కలిసివస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నచ్చిన కాంట్రాక్టరు పేరుతో..

నిబంధనల ప్రకారం ఈ అద్దె కార్ల కోసం టెండరు ప్రక్రియ నిర్వహించాలి. కనీసం షార్ట్ టెండరు నోటిఫికేషన్ అయినా ఇవ్వాలి. కానీ నామినేషన్ పద్ధతిపై అధికారులు ఎవరికి వారే తమకు అనుకూలమైన కాంట్రాక్టర్ల పేరుతో ఈ అద్దె కార్ల కాంట్రాక్టును కొనసాగిస్తున్నారు. వారి పేర్లతో ప్రతినెలా బిల్లులు డ్రా చేసుకుని పంచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

ఒక్కో కారుకు రూ.39 వేల చొప్పున..

అద్దె కార్లకు ప్రతినెలా రూ.39 వేలు విద్యుత్ శాఖ చెల్లిస్తుంది. నిబంధనల ప్రకారం ఈ కారు అద్దెకు పెట్టిన కాంట్రాక్టరు ప్రతినెలా 2,500 కిలోమీటర్లు నడపాలి. డ్రైవరు వేతనం, డీజిల్ వంటి ఖర్చులు కాంట్రాక్టరే పెట్టుకోవాలి. అయితే కొందరు అధికారులు తమ సొంత కార్లలో నెలకు కనీసం 500 కిలోమీటర్లు కూడా తిరగకుండానే ప్రతినెలా 2,500 కిలోమీటర్లు తిరిగినట్లు పూర్తి స్థాయిలో బిల్లులు డ్రా చేస్తున్న అధికారులు కొందరు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఆయా కాంట్రాక్టర్లు చేసిన వివిధ పనులకు ఎంబీ రికార్డులు, బిల్లుల చెల్లింపులు వంటివి చేసేది అధికారులే కావడంతో తమ కాంట్రాక్టు కంపెనీ పేరుతో బిల్లులు డ్రా చేసినా సదరు కాంట్రాక్టర్లు సహకరిస్తున్నారనేది బహిరంగరహస్యంగా మారింది.

స్పందించని ఎస్‌ఈ..

ట్రాన్స్‌కోలో కొనసాగుతున్న అద్దెకార్ల దందాపై వచ్చిన ఆరోపణల విషయమై 'సాక్షి'విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శ్రీనాథ్‌ను వివరణ కోరేందుకు కార్యాలయానికి వెళ్లగా వివిధ పనుల్లో బిజీగా ఉన్నారని సిబ్బంది పేర్కొన్నారు. మొబైల్ నం.9440813620కు సంప్రదించినా కూడా ఆయన స్పందించలేదు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం

అధికారులకు కలెక్టర్ క్రాంతి ఆదేశం



చేర్యాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కంది(సంగారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారు లను ఆదేశించారు. మండల పరిధిలోని చేర్యాలలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను బుధవారం కలెక్టర్ క్రాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మండలంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన చేర్యాల గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే నిర్మాణపు పనుల్లో నాణ్యత, నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ప్రతీ ఇల్లు 400ల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించాలన్నారు. గ్రామంలో 65ఇళ్లు మంజూరు కాగా 12ఇళ్లు బేస్‌మెంట్‌స్థాయిలో ఉన్నాయని హౌసింగ్ పీడీ చలపతిరావు తెలిపారు. అనంతరం కందిలో నిర్మిస్తోన్న ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ సరఫరా, మంచి నీరు,మురుగు కాలువల ఏర్పాటు వంటి మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ మాధవరెడ్డి, ఎంపీవో మహేందర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలకు తోడ్పాటు హర్షణీయం

సంగారెడ్డి జోన్: ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రైవేటు సంస్థలు భాగస్వాములు కావడం అభినందనీయమని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. పోతిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో కెరియర్ టెక్నాలజీ సంస్థ సిబ్బంది పాఠశాలలను దత్తత తీసుకుని మౌలిక వసతులకల్పన చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి బుధవారం కలెక్టర్ క్రాంతి హాజరయ్యారు. పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన టాయిలెట్స్, తాగునీటి ట్యాంకును, కుళాయిలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని నిరుపేద విద్యార్థుల సంక్షేమం కోసం ప్రైవేట్ సంస్థల యాజమాన్యం సిబ్బంది కృషి చేయడం హర్షించదగ్గ పరిణామమన్నారు. రూ.50 లక్షలతో తరగతి గదుల ఆధునీకరణ, క్రీడా పరికరాలు, సైన్స్ మెటీరియల్‌ను, మౌలిక సదుపాయాలు, కెరియర్ అవగాహన చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, కెరియర్ టెక్నాలజీ సంస్థ నిర్మాణ అధినేత నందా లక్కిరాజు, నిర్మాణ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి అనురాధ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిమ్జ్ గ్రామసభలో స్వల్ప ఉద్రిక్తత

- భూమికి భూమి లేదా తగిన పరిహారం ఇవ్వాలని కోరిన రైతులు
- మామిడ్గి గ్రామంలో ఘటన
- నచ్చజెప్పిన పోలీసులు



భూములు ఇచ్చేది లేదంటూ నినాదాలు చేస్తున్న పలువురు రైతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మామిడ్గి గ్రామంలో నిర్వహించిన (నిమ్జ్) గ్రామ సభలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. నిమ్జ్ భూసేకరణకు సంబంధించి బుధవారం ఉదయం గ్రామ సమీపంలో గల రైతు వేదికలో పోలీస్ బందోబస్తు మధ్య గ్రామసభ నిర్వహించారు. సభకు నిమ్జ్ ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్ రాజు, న్యాల్‌కల్ తహసీల్దార్ భూపాల్ హాజరయ్యారు. భూసేకరణకు సంబంధించి డిప్యూటీ కలెక్టర్ రాజు మాట్లాడుతూ...నిమ్జ్ ఏర్పాటు వల్ల ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ క్రమంలో కొందరు రైతులు కలుగజేసుకుని మావి సారవంతమైన మూడు పంటలు పండే భూములని, ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఎంతమాత్రం సరిపోదని, మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అదే విధంగా భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కూడా కల్పించాలని, లేదా భూమికి బదులుగా భూమి ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలో ఒకరిద్దరు రైతులు అభ్యంతరం చెప్పడంతో వారిమధ్య మాటా మాటా పెరిగి స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. సభ నుంచి బయటకు వచ్చిన కొందరు రైతులు నిమ్జ్‌కు భూములు ఇచ్చేది లేదని నినాదాలు చేశారు. అక్కడే ఉన్న పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రెండు వర్గాలకు సర్దిచెప్పారు.

శారీరక దారుఢ్యం కీలకం

- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
- జోగిపేట పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ



జోగిపేట పీఎస్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

జోగిపేట(అందోల్): పోలీసు శాఖలో శారీరక దారుఢ్యం చాలా కీలకమని ప్రతీరోజు వ్యాయామం చేయాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. జోగిపేటలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల పరంగా, వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని, సిబ్బంది సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. సైబర్ నేరాలు, ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయ ఆవరణను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాహనాల తనిఖీ, నాకాబందీ, స్పెషల్ డ్రైవ్స్ చేపట్టి అనుమానిత వ్యక్తులను, వాహనాలను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిబద్ధతతో ఉండాలని, కేటాయించిన విధులను పూర్తి బాధ్యతతో నిర్వహించాలన్నారు. జోగిపేట పోలీస్‌స్టేషన్ పరిశీలనలో సంతృప్తిని వ్యక్తం చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ విజయ్ కృష్ణ, జోగిపేట ఎస్‌ఐ పాండు, సిబ్బంది ఎస్పీ వెంట ఉన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ చేసిన ఎస్పీ

సంగారెడ్డి జోన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ ఆంథోని పాఠశాల పరీక్ష కేంద్రాలను బుధవారం ఎస్పీ పరితోష్ పంకజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ఈ నెల 6 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద (144) సెక్షన్ అమలులో ఉంటుందని, సెంటర్ల వద్ద గుంపులు గుంపులుగా సంచరించేందుకు వీలులేదన్నారు. 100 మీటర్ల దూరం వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎలాంటి జిరాక్స్ సెంటర్స్ ఓపెన్ చేయకూడదని స్పష్టం చేశారు.

ఛాయాచిత్రకళలో వాస్తవాన్వేషణ

ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ దీపక్ జాన్



కుండల తయారీపై అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు: 'ఒక చిత్రం వెయ్యి పదాలకు సమానం'అనేది నానుడి. దానిని మరింత విస్తృతపరుస్తూ, ఛాయా చిత్రకళలో 'నిజాన్ని వెతుక్కుంటూ..'అనే శీర్షికన ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ దీపక్ జాన్ మాథ్యూ బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. ఛాయా చిత్రకళపై లోతైన అవగాహనను ఏర్పరిచేలా సాగిన ఈ కార్యక్రమంలో ఫొటోగ్రఫీ చారిత్రక పరిణామం వంటి అంశాలను వివరించారు.

కుండల తయారీపై అవగాహన...

గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్‌సైన్సెస్ (జీఎస్‌హెచ్‌ఎస్)లోని లలిత, ప్రదర్శన కళల విభాగం కుండల తయారీపై ఒక రోజు వర్క్ షాప్‌ను నిర్వహించింది. ఇందులో పాల్గొన్న వారికి, మట్టితో పనిచేయడం వల్ల కలిగే సృజనాత్మక, చికిత్స ప్రయోజనాలను తెలియజేశారు. కుండలు మానసిక దృష్టి, ఏకాగ్రతను ఎలా పెంచుతాయో, ప్రశాంతతను, సద్బుద్ధిని ఎలా పెంపొందిస్తాయో ఈ వర్క్‌షాప్‌లో వివరించారు.

పాఠశాలలో టీచర్ల డుమ్మా

- తరగతి గదులు వదిలి ఆరుబయటే ఆడుకున్న విద్యార్థులు
- రోడ్డు పక్క పాఠశాల కావడంతో స్థానికుల ఆందోళన



పాఠశాలలోలేని ఉపాధ్యాయులు

నారాయణఖేడ్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఇష్టానుసారంగా విధులకు ఎగనామం పెడుతుండటంతో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. నిత్యం ఏదో ఓ చోట ప్రభుత్వ పాఠశాలలపై ఆరోపణలు వస్తున్నా విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పరిస్థితి మరింత దిగజారుతోంది. నారాయణఖేడ్ పట్టణానికి కిలోమీటరు దూరంలో.. ఎంపీడీవో కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న జూకల్ తండా ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు బాబురావు, కవిత బుధవారం పైఅధికారులకు చెప్పా పెట్టకుండా బడి నుంచి వెళ్లిపోయారు. ఈ పాఠశాలలో 30మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మధ్యాహ్నం 12.30గంటల సమయంలో



ఇద్దరు ఉపాధ్యాయులూ పాఠశాలలో లేరు. దీంతో విద్యార్థులు ఆరుబయట, రోడ్డు వెంట ఆడుతూ కన్పించారు. తమకు తలనొప్పి వస్తోందని, తనను పాఠశాలను చూస్తుండమని పక్కనే ఉన్న అంగన్‌వాడీ టీచర్ సాంకీబాయికి చెప్పి టీచర్లు ఇద్దరూ వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఇద్దరు ఉపాధ్యాయులూ ఒకేసారి విధులకు డుమ్మా కొట్టి వెళ్లిపోవడంతో పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. డీఈవో వెంకటేశ్వర్లు వద్ద టీచర్ల డుమ్మా విషయాన్ని ప్రస్తావించగా ఎంఈవోను పంపించి విచారణ చేయిస్తానని సమాధానం ఇచ్చారు.

విరిసిన వసంతం



జహీరాబాద్‌లో పలు గ్రామాల్లో రోడ్లపక్కనే ఉన్న మోదుగు చెట్లు ఇలా విరగబూసి వసంతాన్ని గుర్తు చేస్తున్నాయి. సహజ రంగులు, ఔషధ తయారీకి వాడే ఈ పూలు వికసించి ఇలా కనువిందు చేస్తున్నాయి. వీటి ఆకులతో విస్తర్లు కుట్టి వాటిలో భోజనం చేస్తుంటారు.

– జహీరాబాద్‌టౌన్



కూలీలకు ఉపాధి కల్పించాలి

అదనపు డీఆర్‌డీవో బాలరాజు



కంగ్టి శివారులో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న అదనపు డీఆర్డీవో బాలరాజు తదితరులు

కంగ్టి/కల్హేర్ (నారాయణఖేడ్): కూలీలకు ఉపాధి హామీ పనులను కల్పించాలని, ఆ పనులకు కూలీలు గరిష్ట వేతనం పొందేటట్లు అధికారులు చొరవ చూపాలని జిల్లా అదనపు డీఆర్డీవో బాలరాజు సూచించారు. కంగ్టిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఉపాధిపనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. చాప్టా(కే), కంగ్టి గ్రామాల శివారులో కూలీలకు పనులపై అవగాహన కల్పించారు. ఉపాధి హాజరు పరిశీలించేందుకు మస్టర్ రోల్ ప్రకారం కూలీలకు హాజరు తీసుకున్నారు. చాప్టా(కే)లో 80మంది, కంగ్టిలో 220 మంది కూలీలు పనులు చేశారు. అదే విధంగా కల్హేర్‌లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామి సిబ్బందితో బాలరాజు సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న పనుల గురించి చర్చించారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ...అన్ని పంచాయతీల్లో పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, ఎంపీటీఓ సత్తయ్య, ఏపీఓ నర్సింలు, టీఏలు ఉపాధి సిబ్బంది, కూలీలు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌కు వివాహపత్రిక అందజేత



వైఎస్‌జగన్‌కు వివాహపత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తన సోదరుడి కుమారుడు సంతోష్‌రెడ్డి వివాహానికి హాజరుకావాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం విజయవాడ తాడేపల్లిలోని వైఎస్ జగన్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. మహిపాల్‌రెడ్డి వెంట సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ రంగంపై ఉచిత శిక్షణ

- 15 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- టీజీబీసీ స్టడీ సర్కిల్ జిల్లా డైరెక్టర్ దయాసాగర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ రంగంపై నెల రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు టీజీబీసీ స్టడీ సర్కిల్ సిద్దిపేట డైరెక్టర్ కృష్ణ దయాసాగర్ బుధవారం తెలిపారు. ఈ శిక్షణ హైద్రాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ పూర్తయి, 26 ఏళ్ల లోపు ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 15 నుంచి ఏప్రిల్ 8 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు ఏప్రిల్ 12 నుంచి ఉమ్మడి జిల్లా కేంద్రంలో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు టీజీబీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

లేఖా రచన పోటీల్లో ప్రతిభ

జాతీయస్థాయిలో ఉపాధ్యాయుడికి బహుమతి



రాజేశ్వర్

తూప్రాన్: భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో గతేడాది డిసెంబర్ నెలలో నిర్వహించిన ఉత్తరాల రచన పోటీల్లో వజ్జ రాజేశ్వర్‌కు జాతీయ స్థాయి (తెలంగాణ సర్కిల్) తృతీయ బహుమతి దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విషయాన్ని తపాలా శాఖ అధికారులు బుధవారం తెలిపారన్నారు. 'డిజిటల్ యుగంలో ఉత్తరాల ప్రాముఖ్యత' అనే అంశంపై తపాలా శాఖ లేఖా రచన పోటీ నిర్వహించినట్లు తెలిపారు. బహుమతి కింది రూ.5,000 నగదుతోపాటు కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ నుంచి ధ్రువపత్రం అందజేయనున్నారని తెలిపారు. ప్రస్తుతం రాజేశ్వర్ పట్టణంలోని గీతా స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పీ.రామాంజనేయులు, చైర్ పర్సన్ ఉష, ప్రిన్సిపాల్ వెంకట కృష్ణ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

వ్యక్తి అదృశ్యం



మొగులం సాబ్

జిన్నారం (పటాన్‌చెరు): మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం మేరకు.. మాదారం గ్రామంలో నివాసముండే దూదేకుల మొగులం సాబ్ (69) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. 9న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కొడకంచి వైపుగా వెళ్లినట్లు స్థానికులు కుటుంబీకులకు తెలిపారు. కొడకంచి పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. మొగులం కుమారుడు దావుద్ ఫిర్యాదు మేరకు బొల్లారం పోలీసులు కేసు నమోదు చేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్: బెస్ట్ అవైల్డ్ ఏబుల్ స్కూల్స్‌లో పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి, పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని పరిపాలన అధికారి పరమేష్, డిప్యూటీ డైరెక్టర్ ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ.. జిల్లాలో ఎంపిక చేసిన బెస్ట్ అవైల్డ్ ఏబుల్ స్కూల్స్‌లకు ప్రభుత్వం నుంచి గత కొన్ని నెలలుగా రావాల్సిన పెండింగ్ బిల్లుల రాకపోవటంతో సంబంధించిన స్కూల్‌ల యాజమాన్యలు, విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు, దుస్తులు, మెనూ ప్రకారం, ఆహారం అందించడం లేదని దీని వల్ల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందటం లేదని విద్యార్థుల తల్లి తండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం బెస్ట్ అవైల్డ్ ఏబుల్ స్కూల్స్‌ల పెండింగ్ బిల్లులు మంజూరు చేసి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు రాజు, ఫోరమ్ ప్రధాన కార్యదర్శి అమిదిపురం మహేష్‌కుమార్, సహకార్యదర్శి పాండు రంగం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఇతర అధికారులు



మహిళా దినోత్సవ వేడుకల్లో సీపీ, పోలీసు అధికారులు, మహిళలు

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- కలెక్టర్ రాహుల్ రాజ్
- మెదక్ కలెక్టరేట్‌లో ఘనంగా మహిళా దినోత్సవం

మెదక్ కలెక్టరేట్: సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం మెదక్ సమీకృత కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఐడీఓసీని నిత్యం పరిశుభ్రంగా ఉంచుతున్న మహిళా శానిటేషన్ సిబ్బందిని, మహిళా పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సత్కరించి, బహుమతులు అందజేశారు. అదే విధంగా వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులను, ఉత్తమ మహిళా ఉద్యోగులను ప్రశంసాపత్రాలతోపాటు బహుమతులను ప్రదానం చేశారు. గెలుపొందిన వారికి కలెక్టర్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, డీడబ్ల్యూ హైమావతి, అదనపు డీఆర్డీఓ సరస్వతీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయలక్ష్మీ, ఎస్సీ సంక్షేమ అధికారిని శశికళ, గిరిజన సంక్షేమ అధికారిని నీలిమ , మెప్మా పీడీ ఇందిరా, సీడబ్ల్యూసీ చైర్మన్ ఉప్పలయ్య, సీడీపీఓలు స్వరూప, హేమ భార్గవి, వెంకటరమణ, పద్మలత, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

- సిద్దిపేట సీపీ అనురాధ
- పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో మహిళా దినోత్సవం

సిద్దిపేటకమాన్: మహిళల సమానత్వం ఇంటి నుంచే ప్రారంభం కావాలని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో సీపీ బుధవారం కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు చదువు చాలా ముఖ్యమన్నారు. విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలన్నారు. మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్న వెంటనే ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలన్నారు. తల్లిదండ్రులు ఇంట్లో మగ పిల్లలను, ఆడపిల్లలను సమానంగా చూడాలన్నారు. జిల్లాలో మహిళలు, పిల్లల సంరక్షణ కోసం ప్రత్యేకంగా షీ టీమ్స్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. పోలీస్ సిబ్బందికి నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారిని సీపీ అభినందించారు. అనంతరం మెమోంటోతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసీపీ మధు, సీఐలు విద్యాసాగర్, విష్ణు ప్రసాద్, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ పెట్రోల్ బంకు

ప్రారంభించిన కలెక్టర్ మను చౌదరి, సీపీ అనురాధ

సిద్దిపేటఅర్బన్: పోలీస్ శాఖకు చెందిన పెట్రోల్ బంకులో పెట్రోల్, డీజిల్ ఎలాంటి కల్తీ లేకుండా క్వాలిటీగా క్వాంటిటీగా ఉంటుందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మను చౌదరి, పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల శివారులో పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను కలెక్టర్, సీపీ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలీస్ శాఖ పెట్రోల్ పంపు ద్వారా వచ్చే ఆదాయం పోలీస్ శాఖకు చెందిన సిబ్బంది సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగించడం జరుగుతుందన్నారు. పోలీస్ కన్వెన్షన్ ద్వారా వచ్చే ఆదాయం సైతం పోలీస్ వెల్ఫేర్ సొసైటీకి వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు మధు, పురుషోత్తంరెడ్డి, సతీష్, రవీందర్, ఆర్ఐలు విష్ణుప్రసాద్, రాజేష్, ఐఓసీ సీనియర్ మేనేజర్ శ్రీనివాస్, సిద్దిపేట మేనేజర్ అమిత్ కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, శ్రీధర్, శ్రీధర్‌గౌడ్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సీసీ నితిన్‌రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- ఖాదిరాబాద్ గ్రామంలో విషాదం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ పరితోష్ పంకజ్, డీఎస్పీ సత్తయ్య



గౌరమ్మ (ఫైల్)

వట్‌పల్లి(అందోల్): మహిళ దారుణ హత్యకు గురైన ఘటన జోగిపేట పోలీస్‌సర్కిల్ పరిధిలోని వట్‌పల్లి మండలం ఖాదిరాబాద్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొట్టె గౌరమ్మ(45) భర్త వీరప్ప పదేళ్ల కిందట మృతి చెందాడు. కుమారుడు హైద్రాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటూ అక్కడే ఉంటుండగా, గౌరమ్మ స్వగ్రామంలో ఒక్కతే ఉంటుంది. ప్రతి రోజూ ఉదయమే లేచే ఆమె బుధవారం లేవకపోవడంతో చుట్టుపక్కల వారు వెళ్లి తలుపులు కొట్టారు. స్పందించకపోవడంతో కిటికీలోంచి చూడగా మంచంపై ఉన్న బట్టలు కాలిపోయి పొగలు వస్తుండగా, పక్కనే గౌరమ్మ కిందపడి ఉంది. వెంటనే తాళాలు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా చనిపోయి ఉంది. పక్క గ్రామంలో ఉన్న మృతురాలి సోదరుడు వీరేశంకు, పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్, డీఎస్పీ సత్తయ్య గౌడ్ వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి మెడపై గాయాలు ఉండటంతో హత్య జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు జాగిలాన్ని తెప్పించి విచారణ చేపట్టగా హత్య జరిగిన ప్రదేశంలో కారం చల్లడంతో జాగిలం ఇంటి నుంచి కొంత దూరం వెళ్లి ఆగిపోయింది. మృతురాలి వీరేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అగ్నికి ఆహుతి.. నష్టాన్ని మిగిల్చి



కాలిపోయిన మక్క చేను



దగ్ధమైన మామిడి తోట

మక్క చేను దగ్ధం

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రమాదవశాత్తు మక్క చేను దగ్ధమైన ఘటన మండల పరిధిలోని మల్లుపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత రైతు మంతూరి కిష్టయ్య తెలిపిన వివరాల ప్రకారం .. రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ కరెంటు తీగలు ఒక దానికొకటి రాపిడై నిప్పు రవ్వలు ఎగసి పడటంతో మక్క చేను కాలి బూడిదైపోయింది. ఇందులో మక్క పంటతోపాటు, ఎకరంలో వేసిన డ్రిప్ పైపులు, గేట్ వాల్లు కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు తనకు నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరాడు.

చిన్నకోడూరులో మామిడి తోట

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మామిడి తోట దగ్ధమైన ఘటన మండల పరిధిలోని రామంచ శివారులో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఎడ్ల బాల్‌రెడ్డికి 10 ఎకరాల మామిడి తోట ఉంది. ఆ తోటను సిద్దిపేటకు చెందిన రామోజీ లీజ్‌కు తీసుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మామిడి తోటలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలార్పినప్పటికీ తోట పూర్తిగా దగ్ధమైంది. తోటలో ఉన్న డ్రిప్ పైపులు కాలిపోయాయి. సుమారు రూ. 8 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

బీటీ రోడ్లకు మోక్షం

18 రహదారులకు రూ.45 కోట్లు మంజూరు : హరీశ్‌రావు

సిద్దిపేటఅర్బన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజూరై, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రద్దయ్యి ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించడానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బీటీ రోడ్ల నిర్మాణాలకు రూ.45 కోట్లు మంజూరు చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పనులను రద్దు చేశారని పేర్కొన్నారు. ఆ పనులను మళ్లీ ప్రారంభించి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. 18 బీటీ రోడ్ల పనులను ప్రారంభించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రామంచ–చంద్లాపూర్ పీఆర్ రోడ్డు నుంచి సిరిసిల్ల రోడ్డు వరకు రూ.1.97 కోట్లు, పెద్దకోడూరు నుంచి చిన్నకోడూరు వరకు రాజీవ్ రహదారిని కలిపే రోడ్డుకు రూ.1.52 కోట్లు, కిష్టాపూర్ ఎస్సీ కాలనీ నుంచి గుండారం వరకు బీటీ రోడ్డుకు రూ. 2.65 కోట్లు, సిద్దిపేట–హుస్నాబాద్ రోడ్డు నుంచి మిట్టపల్లి–మందపల్లి రోడ్డు వరకు రూ.4 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. బక్రిచెప్యాల నుంచి దర్గా, దుద్దెడ వరకు బీటీ రోడ్డుకు రూ. 3.43 కోట్లు, గట్లమల్యాల నుంచి ఆరేపల్లి మీదుగా కొండంరాజుపల్లి రోడ్డుకు రూ.4 కోట్లు, రంగాయపల్లి నుంచి తెనుగువానిపల్లి వరకు రూ. 2.66 కోట్లు, మాచాపూర్–రంగాయపల్లి పీఆర్ రోడ్డు నుంచి జంతు హాస్టల్ ద్వారా బీటీ రోడ్డుకు రూ.1.23 కోట్లు మంజూరని పేర్కొన్నారు. రాజీవ్ రహదారి నుంచి అనిమల్ హాస్టల్ మీదుగా పొన్నాల పీఆర్ రోడ్డు వరకు రూ.2.44 కోట్లు, చిన్నగుండవెల్లి నుంచి రాంపూర్ వరకు రూ. 2.25 కోట్లు, చిన్నగుండవెల్లి నుంచి ఇర్కోడు వరకు రూ. 4 కోట్లు, సిద్దన్నపేట నుంచి రాంపూర్ వరకు రూ.3.07 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. సికింద్లాపూర్ నుంచి శివునిపల్లి మీదుగా చెర్ల అంకిరెడ్డిపల్లి వరకు రూ. 3.60 కోట్లు, కస్తూరిపల్లి నుంచిడి దర్గపల్లి వరకు రూ.2.03 కోట్లు, జక్కాపూర్ డబుల్ బెడ్రూంల వద్ద నుంచి కోడివారి కాలనీ మీదుగా జక్కాపూర్ విఠలాపూర్ పీఆర్ రోడ్డు వరకు రూ. 2.88 కోట్లు, చంద్లాపూర్‌లోని కబీర్‌పల్లి నుంచి గంగాపూర్‌లోని పిట్టలవాడ వరకు రూ. 2.88 కోట్లు, నాగరాజుపల్లి నుంచి మాచిరెడ్డిపల్లి వరకు రూ. కోటి, వెంకటాపూర్ నుంచి అప్పలాయచెర్వు వరకు రూ. 75 లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

సంగారెడ్డి క్రైమ్: కాల్వలో పడి వ్యక్తి మృతి చెందాడు. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని సాయి నగర్ కాలనీకి చెందిన దానయాల ఆంజనేయులు గౌడ్ (48) కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. 10న పని డబ్బులు తీసుకురావాలని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం శారద ఆస్పత్రి ఎదుట మురికి కాల్వలో మృతదేహమై కనిపించాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. చుట్టుపక్కల సీసీ కెమెరాలు పరిశీలించగా బైపాస్‌లోని బెల్ట్ షాపులో మద్యం కొనుగోలు చేసినట్లు గుర్తించారు. మద్యం మత్తులో మూత్ర విసర్జనకు వెళ్లి కాల్వలో పడి మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య కౌసల్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్యా బిడ్డలకు దూరమై.. జీవితమే భారమై

బంగారం శుద్ధి చేసే విషం తాగి స్వర్ణకారుడు ఆత్మహత్య



రాములు(ఫైల్)

పాపన్నపేట(మెదక్): మిల మిల మెరిసే బంగారు ఆభరణాలు తయారు చేసే అతడి కుటుంబ జీవితంలో చీకటి కోణాలు దాగి ఉన్నాయి. తాత్కాలిక ఆవేశాలతో భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ కొంప ముంచింది. రోజు వారి వేధింపులు భరించలేక ఇద్దరు బిడ్డలను తీసుకొని ఆ ఇల్లాలు పుట్టింటికి వెళ్లిపోయింది. మీరు లేని జీవితం నాకొద్దంటూ ఆ స్వర్ణకారుడు బలన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పాపన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అవుసుల రాములు మేడ్చల్‌లో కుల వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడికి భార్య సరళ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబ విషయంలో భార్యా భర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. సరళ కొద్ది రోజుల కిందట పిల్లలను తీసుకొని పుట్టినిల్లు ఎల్లారెడ్డికి వెళ్లి పోయింది. దీంతో తీవ్ర మనో వేదనకు గురైన రాములు స్వగ్రామమైన కొత్తపల్లికి వచ్చి బంగారం శుద్ధి చేసే విషం తాగాడు. బుధవారం గ్రామ శివారులోని మెయిన్ రోడ్డు పక్కన శవమై కనిపించాడు. మృతుడి తమ్ముడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలోని బజాజ్ షోరూం ఎదురుగా పేకాట ఆడుతున్న ఐదుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ పాండు తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు దాడి నిర్వహించగా గోపాల్, శ్రీశైలం, నాగరాజు, మల్లేశం, వెంకటేశం పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.47 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో ఐఐటీహెచ్ సత్తా



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ప్రపంచవ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలకు ఇచ్చే క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో సంగారెడ్డి జిల్లా కందిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) హైదరాబాద్ సత్తా చాటింది. బై సబ్జెక్ట్ 2025 లో ఐఐటీ హైదరాబాద్ ఆరు విభాగాలలో గ్లోబల్ గుర్తింపు సాధించింది. విస్తృతమైన విద్యా విభాగంలో, మొదటిసారిగా 501–510 శ్రేణిలో ర్యాంక్ పొందింది. మెటీరియల్స్ సైన్స్, ఎలక్ట్రికల్ – ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, మెకానికల్, ఏరోనాటికల్ – మానుఫ్యాక్చరింగ్ ఇంజనీరింగ్, ఫిజిక్స్ – ఆస్ట్రోనమీ, కంప్యూటర్ సైన్స్ – ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ వంటి వాటిల్లో ర్యాంక్ లు వచ్చాయని ఐఐటీ వర్గాలు తెలిపాయి. 2008లో స్థాపించబడిన రెండవ తరం ఐఐటీల్లో హైదరాబాద్ ఐఐటీ ఒకటి. పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, స్టార్టప్‌లలో ఈ ఉన్నత విద్యా సంస్థ దేశంలోనే ముందు వరుసలో ఉంటుంది. జాతీయస్థాయిలో ఇచ్చే ఎన్ఐఆర్ఎఫ్ –2024 ర్యాంకింగ్‌లో ఐఐటీ హైదరాబాద్ 3వ స్థానంలో నిలిచింది. అలాగే ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో 8వ స్థానంలో ఉంది. సుమారు 5,400 మంది యూజీ, పీజీ, పీహెచ్‌డీ స్కాలర్లు ఇందులో చదువుకుంటున్నారు. గతేడాది సుమారు 210 పేటెంట్లు సాధించిన ఈ విద్యా సంస్థలో సుమారు 260 స్టార్టప్‌లు ఆవిర్భవించాయి. తాజాగా ప్రపంచస్థాయి ర్యాకింగ్‌లోనూ ఈ ఉన్నత విద్యాసంస్థ తన సత్తాను చాటింది.

విదేశాలకు ఎగుమతితో మంచి లాభాలు

- ఏపీఈడీఏ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్‌పీ నాయుడు
- కేవీకేలో మామిడి రైతులకు అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీ నాయుడు

కౌడిపల్లి(నర్సాపూర్): మామిడి పండ్లను విదేశాలకు ఎగుమతి చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని ఏపీఈడీఏ (అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ) అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్‌పీ నాయుడు సూచించారు. బుధవారం మండలంలోని తునికి వద్ద గల డాక్టర్ డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ఏపీఈడీఏ ఆధ్వర్యంలో మామిడి సాగు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన మామిడి పంటను ఉత్పత్తి చేస్తే విదేశాలకు ఎగుమతి చేయొచ్చన్నారు. దీంతో అధిక లాభాలు వస్తాయన్నారు. విదేశాలకు ఎగుమతి చేసేందుకు ప్రభుత్వ లైసెన్స్ అవసరం ఉంటుందన్నారు. అనంతరం కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం మామిడి పంట పిందె దశలో ఉన్నాయని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పూత పిందె రాలితే శాస్త్రవేత్తల సూచనలు పాటించాలన్నారు. మామిడి తోటను ప్రతి రోజూ గమనించి తెగులు, చీడపీడలు సోకకుండా చర్యలు తీసుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి ప్రతాప్‌సింగ్, కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్, నర్సాపూర్ డివిజన్ హార్టికల్చర్ అధికారి సంతోష్, ఆయిల్‌ఫామ్ మేనేజర్ క్రిష్ణ, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య కుసుమ

నూనెపై పెరిగిన అవగాహన

- మార్కెట్‌లోనూ డిమాండ్
- పంటకు పూర్వ వైభవం
- జిల్లాలో సుమారు 10 వేల ఎకరాల్లో సాగు



జహీరాబాద్ ప్రాంతంలో సాగవుతున్న తెల్ల కుసుమ

జహీరాబాద్ టౌన్: కుసుమ రబీలో సాగు చేయు నూనె గింజ పంట. మార్కెట్‌లో నకిలీ నూనెలు కనిపిస్తున్న తరుణంలో ఆరోగ్యంపై శ్రద్ధ చూపేవారు కుసుమ నూనెను వాడుతుంటారు. ఈ నూనెను వాడడం వల్ల శరీరంలోని కొవ్వు శాతం తగ్గించి గుండె జబ్బులు, శ్వాస కోశ సమస్యల నియంత్రణకు ఉపయోగపడుతుంది. ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుండటంతో ఈ నూనె వాడకం ఎక్కువైంది. దీంతో జహీరాబాద్ ప్రాంతంలో కుసుమ నూనె తీసే మిల్లులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నూనెను ఇష్టపడే వారు రైతుల వద్ద కుసుమలు కొనుగోలు చేసుకొని మిల్లుల వద్ద నూనె పట్టించుకొని సంవత్సరం పాటు నిల్వ ఉంచుకుంటున్నారు. కుసుమ సాగుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేకపోవడంతో ఆశించిన మేర సాగు విస్తీర్ణం పెరగడం లేదు.

అంతర పంటగా సాగు

తక్కువ పెట్టుబడి, నీటి తడులు లేకుండా సాగు చేసే పంటల్లో తెల్ల కుసుమ కూడా ఒక్కటి. ఏక పంట కాకుండా శనగ, తెల్ల జొన్న, ధనియాలు తదితర పంటల్లో అంతర పంటగా కూడా సాగు చేసుకోవచ్చు. పూర్వీకుల కాలం నుంచి ఈ పంటను సాగు చేస్తున్నారు. నూనెలో ఆయుర్వేద గుణాలు ఉండటంతో ఇదే వాడే వారు. మార్కెట్‌లోకి వివిధ రకాల పంట నూనెలు తక్కువ ధరకు దొరుకుతుండడంతో కుసుమకు డిమాండ్ తగ్గడం వల్ల సాగు విస్తీర్ణం పడిపోయింది. ఇటీవల కాలంలో ఈ నూనె ఉపయోగంపై ప్రజల్లో అవగాహన పెరగడంతో మళ్లీ డిమాండ్ పెరిగింది. పంటకు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతోపాటు గిట్టుబాటు ధర లభిస్తుంది. జిల్లాలో సుమారు 10 వేల ఎకరాల్లో తెల్ల కుసుమ పంట సాగవుతుంది. ఎకరానికి రూ. 7 వేల వరకు ఖర్చు అవుతుంది. మార్కెట్‌లో క్వింటాల్ కుసుమలకు రూ. 6 వేల ధర పలుకుతుంది. వ్యవసాయ అధికారులు కూడా యాసంగిలో కుసుమ పంటను సాగు చేసుకోవాలని చెబుతున్నారు.

సాగు విధానం

తెల్ల కుసుమ పంట సాగుకు నీరు నిల్వ లేని నల్లరేగడి పొలాలు అనుకూలం. అంతర పంటగా సాగు చేయడం వల్ల అదనపు ఆదాయం వస్తుంది. 120 నుంచి 140 రోజుల్లో పంట కోతకు వస్తుంది. సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు పంట సాగు చేసుకోవచ్చు. ఎకరానికి 7 నుంచి 8 క్వింటాల్ వరకు దిగుబడి వస్తుంది. రోగాలను తట్టుకునేందుకు కిలో విత్తనానికి 2 గ్రాముల క్యాప్టన్ లేదా 1 గ్రాము కర్బెన్డిజమ్ కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. పూత దశలో ఒక తడి నీరు పెడితే చాలు మంచి దిగుబడి వస్తుంది.

కుసుమ సాగు లాభదాయకం



తెల్ల కుసుమ సాగు వల్ల రైతులకు లాభం కలుగుతుంది. ఇటీవల కాలంలో పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఆరోగ్యానికి మంచిదని ప్రజలు కూడా ఈ నూనెను ఎక్కువగా వాడుతున్నారు. మార్కెట్‌లో కూడా మంచి ధర పలుకుంది. ఆసక్తి కలిగిన రైతులకు సాగుపై అవగాహన కల్పిస్తున్నాం.

–భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్